క్లుప్తంగా

ఎకరాకు రూ.45 వేల పంటల రుణం



మాట్లాడుతున్న మేనేజర్ రవికుమార్

కూడేరు: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్తగా పంట రుణాలు తీసుకునే రైతులకు ఎకరాకు రూ.45 వేలు ఇస్తున్నట్లు స్థానిక ఏపీజీబీ మేనేజర్ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట రుణాలను జూన్ 3 నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి మార్ట్‌గేజ్ చేయకుండానే రూ.3 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. రుణం కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు, ఫొటోలు, లేటెస్ట్ కంప్యూటర్ అడంగల్, 1బీ తీసుకురావాలన్నారు. ఏప్రిల్, మే నెలలో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోని రైతులు ఇంకా 300 దాకా ఉన్నారన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై విస్తృత దాడులు



రాయదుర్గంలోని దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలపై మున్సిపల్ శానిటరీ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత దాడులు జరిగాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ సచివాలయ సిబ్బందితో ప్రధాన రహదారుల వెంబడి అన్ని దుకాణాల్లో తనిఖీ చేశారు. ప్రాణంతక, పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టక్ నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తొలిరోజు ముగ్గురు దుకాణ యజమానులకు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు.

చౌక ధాన్యపు డిపోలు తనిఖీ



చౌక ధాన్యపు డిపోను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేతాజీ రోడ్డులోని 6, 14వ చౌక ధాన్యపు డిపోలను తహసీల్దార్ నాగరాజు గురువారం తనిఖీ చేశారు. డిపోలకు సరఫరా అయ్యే స్టాక్ రికార్డులను పరిశీలించారు. వినియోగదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని, కొలతల్లో తేడాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో బోరుబావుల తవ్వకం నిషేధం

కుందుర్పి: గ్రామాల్లో బోరుబావుల తవ్వకం నిషేధం ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వాల్టా చట్టం అమలులో ఉన్న గ్రామాల రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో నిజవళ్లి, జంబుగుంపల రెవెన్యూ గ్రామాలు వాల్టా చట్టం పరిధిలోకి వస్తాయని డీటీ తిప్పేస్వామి అన్నారు. పైగ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సైతం అనుమతులు ఉండవన్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే బోరు లారీలను సీజ్ చేస్తామన్నారు. భూగర్భ జలాలు అడుగంటుకు పోతున్న తరుణంలో వాల్టా చట్టం అమలులో ఉన్న గ్రామాల్లో బోర్ల తవ్వకాలు నిషేధమన్నారు.

మట్కాబీటర్ అరెస్ట్

కణేకల్లు: మండలంలోని అంబాపురం క్రాస్ వద్ద గురువారం సాయంత్రం మట్కాబీటర్ సత్యనారాయణను అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.7,350 నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి తెలిపారు. నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్ : తుంబిగనూరు శివారులో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి తెలిపారు. గ్రామ శివారులోని చెట్టు కింద పేకాట ఆడుతున్న శివరాజు, పురుషోత్తం, ఎస్.తిమ్మప్ప, టైలర్ తిమ్మప్పలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,030 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు



కాలిపోయిన ద్విచక్రవాహనం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో వన్నూరువలి అనే వ్యక్తి ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనానికి దుండగులు గురువారం తెల్లవారుజామున నిప్పుపెట్టారు. స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆదేశాలు బేఖాతర్

- విచ్చల విడిగా మందుల విక్రయం !
- ఆర్‌ఎంపీల పక్కనే ముందుల దుకాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకూ కార్పొరేట్ స్థాయి పల్లెల్లోనూ అందించారు.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రైవేట్ క్లినిక్‌లు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి, సరైన వైద్యం అందక పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కానీ అధికారుల చర్యలు మాత్రం శూన్యమని ప్రజలు విమర్శిస్తున్నారు.అందుకు నిదర్శనం రాయదుర్గంలోని బళ్లారిరోడ్డులో ఓ ప్రైవేట్ క్లినిక్ పక్కన వైద్యం వికటించి రెండు నెలల వ్యవధిలోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హడావుడిగా తనిఖీలు నిర్వహించిన అధికారులు నామమాత్రపు చర్యలతోనే సరిపెట్టారు. అయితే దానికి అనుసంధానంగా నిర్వహిస్తున్న మెడికల్ దుకాణం మాత్రం కొనసాగించడమేనని చర్చించుకుంటున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సుమారు 400లకు పైగా ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు, 162 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. వీటి పక్కనే వందకు పైగా మెడికల్ దుకాణాలు వాటికి అనుసంధానంతో క్లినిక్‌లు వెలిశాయి. దీంతో విచ్చలవిడిగా ఔషధ విక్రయాలు కొనసాగుతున్నాయి. రాయదుర్గంలో ఇటీవల డ్రగ్ మాఫియా గుట్టు రట్టయ్యింది. మత్తు టానిక్‌లు కర్ణాటక రాష్ట్రానికి రవాణా చేస్తూన్న ముఠా గుట్టు రట్టయ్యింది. ఇలా వరుస ఘటనలతో మెడికల్ దుకాణాలు, ఆర్‌ఎంపీలు వివాదాల్లో నిలుస్తున్నారు.

స్టెరాయిడ్స్ సైతం...

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల పక్కన ఔషధ దుకాణాలు ఉండడంతో విచ్చలవిడిగా మందులు విక్రయిస్తున్నారు. లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం



ఆడుతున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయోటిక్స్, మోకాళ్ల నొప్పులకు స్టెరాయిడ్స్, నొప్పుల నివారణకు మందులు వాడిస్తున్నారు. వీటి వల్ల శరీరంలో అవయవాలు ఎక్కువ భాగం పాడయ్యే ప్రమాదం ఉంది. అధికమోతాతులో ఔషధాలు వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంది. డయాలసిస్ రోగులు కూడా పెరుగుతున్నారు. కొన్ని చోట్ల కాలం చెల్లిన మందుల విక్రయాలు సైతం ఇటీవల కళ్యాణదుర్గంలో వెలుగు చూడడం విశేషం.

లైసెన్స్ ఒకరిది .. నిర్వహణ మరొకరిది

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మెజార్టీ మందుల దుకాణాలన్నీ బినామీల గుప్పిట్లో నడుస్తున్నాయి. నైపుణ్యం కలిగిన ఫార్మసిస్ట్ ఆధ్వర్యంలో కోర్సు పూర్తిచేసి, అనుభం కలిగిన సిబ్బందితోనే దుకాణాలు నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల చాలా చోట్ల వెలుగుచూశాయి. అయినా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మెడికల్ దుకాణాల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకుని నిబంధనలకు పాతరేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మెడికల్ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతాం. ఇప్పటికే రాయదుర్గంలో పలు దుకాణాలపై కేసులు నమోదు చేశాం. నొప్పుల నివారణ మాత్రలు, సూదులు పరిమితికి మించి విక్రయించేవారిపై నిఘా ఉంచాం. ఏజెన్సీల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఏమాత్రం తేడా అనిపించినా లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తాం.

– హనుమప్ప, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం

ఆదమరిస్తే ప్రమాదమే



పట్టణంలో చర్చి ఎదురుగా ధ్వంసమైన కల్వర్టు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 12వ వార్డులోని గంట చర్చి ఎదురుగా ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ నాలుగు రోడ్ల కూడలి ఉండడంతో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. పక్కనే కల్వర్టు ధ్వంసమై, కుంగిపోయింది. రాత్రివేళలో ఎవరైన అజాగ్రత్తగా వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మరోవైపు అదే ప్రాంతంలో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది.

పరామర్శ



పోస్ట్ రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: కళ్యాణదుర్గం మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ భర్త పోస్ట్ రామకృష్ణను మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోస్ట్ రామకృష్ణను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎంఎస్ హనుమంత రాయుడు, కళ్యాణదుర్గం ఎంపీపీ భర్త అంజి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ లేని వీధి బాలల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

అనంతపురం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు సహా ఇతర అంశాలను ఆధార్‌తో ముడిపెట్టింది. దీంతో ఆధార్ చాలా కీలకంగా మారింది. ఈ క్రమంలో ఆధార్ కార్డులు లేని వీధి బాలలు, అనాథ పిల్లలను గుర్తించి ఆధార్ నమోదు చేయించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయాలు, కార్మిక, ఐసీడీఎస్, ఐసీపీఎస్, చైల్డ్‌లైన్ సహా ఇతర శాఖల అధికారులు బృందాలుగా విడిపోయి, ఆధార్ లేని పిల్లలను గుర్తించేందుకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురంలోని వివిధ ప్రాంతాలతో పాటు టీవీ టవర్, లెనిన్ నగర్, నందమూరి నగర్ తదితర ప్రాంతాల్లోనూ గురువారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఒక్క రోజే ఆధార్ కార్డుల్లేని 10 మంది పిల్లలను గుర్తించామని ఐసీపీఎస్ సోషల్ వర్కర్ తోపుల వెంకట్ కుమార్, కౌన్సెలర్ సంధ్య తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ వారి సహకారంతో సమస్యను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి, పైన పేర్కొన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్: అందరితో పోటీ పడుతూ గాండ్ల విద్యార్థులు ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఉన్నతంగా రాణించడం అభినందనీయమని వక్తలు అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని శ్రీబాలాజీ కల్యాణ మండపంలో ఈ ఏడాది ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 41 మంది విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెరవలి రాము, రాష్ట్ర నాయకులు చిత్రచేయుడు విశాలాక్షి, విద్యా కమిటీ కన్వీనర్ పార్లపల్లి రవి మాట్లాడారు. గాండ్ల సామాజిక వర్గం ఒకప్పుడు వెనకబాటుకు గురైనా ఈతరం విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని సునాయసంగా జయిస్తున్నారన్నారు. రాజకీయ, ఆర్థిక, సేవా రంగాల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. పోటీతత్వాన్ని కొనసాగిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని 2. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహుడు, ప్రధాన కార్యదర్శి గవ్వల రమేష్, విజయలక్ష్మి, వెంకటరత్నమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోసు, ప్రధాన కార్యదర్శి వెంకటరాముడు, లలితమ్మ, రఘురాం, లక్ష్మీరాయణ, నరసయ్య, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో మొక్కల పెంపకం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంతంలో వెయ్యి ఎకరాల్లో మొక్కల పెంపకం చేపడుతున్నట్లు అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప తెలిపారు. గురువారం నడుంబీడు, బోరప్పకనుమ, ఉచ్చికాయల పెంట, దావాను పెంట తదితర ప్రాంతాల్లో పర్యటించి, మొక్కల పెంపకానికి సంబంధించి అనువైన ప్రాంతాలను గుర్తించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో కానుగ, నేరేడు, చీమచిగురు, అల్లనేరేడు, టేకు తదితర మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని ఎనుములదొడ్డి, శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు వీరభద్రస్వామి హుండీ కానుకల లెక్కింపు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో ప్రముఖ్య పుణ్యక్షేత్రం ఉండబండ వీరభద్రస్వామి ఆలయ భక్తులు సమర్పించిన కానుకల హుండీని శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహ అధికారి విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ కానుకలు లెక్కింపునకు వచ్చే వారు సాధారణ దుస్తులు ధరలించాలని ఈఓ తెలిపారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద అనంతపురం -బళ్లారి ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన గుజిరీ వ్యాపారులు ఇమాంసేన్, ఖాజా వలి గాయపడ్డారు. గుజిరీ వ్యాపారం చేసుకొని అనంతపురం వెళ్తుండగా ఆటో టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి రహదారి పక్కన గోతిలోకి దూసుకెళ్లింది. స్థానికుల సహాయంతో ఆటోని బయటకు తీశారు.

శేష జీవితంలోనూ సేవలందించాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా జడ్జి భీమరావు తదితరులు

అనంతపురం: శేష జీవితంలోనూ తమ అమూల్యమైన సేవలను మాతృశాఖకు అందించాలని జిల్లా జడ్జి భీమరావు అన్నారు. గురువారం రాత్రి జిల్లా కోర్టులో సీఏఓ జీఆర్ మురళీధర్, ప్రాసెస్ సర్వర్ గుంటి రామమోహన్‌కు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమరావుతో పాటూ జిల్లా అడిషనల్ జడ్జి సత్యవాణి, ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి సాధుబాబు, ఫ్యామిలీ కోర్టు జడ్జి హరిత తదితరులు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగుల సేవాభావం గురించి మాట్లాడారు. అదేవిధంగా ఇరవై ఏళ్ల కిందట న్యాయశాఖలో ఉద్యోగ విరమణ చేసిన గుంటి నరసింహమూర్తి చనిపోయే వరకు నిరంతరం న్యాయశాఖ ఉద్యోగులకు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బాగా పని తెలిసిన వారు క్రమంగా ఉద్యోగ విరమణ చేస్తుంటే వారి అనుభవాన్ని కొత్త తరాలకు పంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. జ్ఞానాన్ని పంచడం కన్నా ఎప్పుడు, ఎక్కడ మన జ్ఞానాన్ని వినియోగించుకోవాలన్న దానిపై మన వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందని దానిని ఉద్యోగులందరూ పాటించాలన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో బాలిక వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలు.. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఓ కుటుంబం 13 ఏళ్ల కూతురికి జూన్ 6న వివాహం చేయాలని ముహూర్తం ఖరారు చేశారు. ఈ విషయం వీఆర్‌ఏ, అంగన్‌వాడీ వర్కర్, సచివాలయ సిబ్బందికి తెలియడంతో వారు పోలీసులు, ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కానిస్టేబుల్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సల్మా, అంగన్‌వాడీ వర్కర్ రాధతోపాటు గ్రామ సచివాలయ సిబ్బంది బాలిక ఇంటికెళ్లి తల్లిదండ్రులకు నోటీసులు ఇచ్చారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

యోగాతో వ్యాధి నిరోధక శక్తి పెంపు



బెళుగుప్పలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

కూడేరు: రోజూ యోగా సాధన చేస్తే శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి అన్నారు. బ్రాహ్మణ పల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. 500 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. గురువారం క్యాడెట్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి మాట్లాడారు. యోగాసనాలతో శ్వాస ప్రక్రియ మెరుగుపడుతుందన్నారు. గుండె సమస్యలు రావన్నారు. కండరాలు, ఎముకలు బలపడతాయన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కై లాస్‌బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్‌లో యోగా చేస్తున్న అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బెళుగుప్ప: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్‌ఐ రమాదేవి తెలిపారు. గురువారం యోగాంధ్రలో భాగంగా రెవెన్యూ అధికారులు స్థానికులతో కలిసి యోగా సాధన చేశారు. ఆర్‌ఐ మాట్లాడుతూ జూన్ 21న యోగాడేని సచివాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు ఈశ్వర్‌రెడ్డి, నరేష్, ఎర్రిస్వామి, ఆనంద్, వీఆర్‌ఏలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దేవస్థానంలో యోగా శిక్షణ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించి, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో యోగా టీచర్ చంద్రశేఖర్, సర్వేయర్ రవితేజ, హెల్త్ సూపర్‌వైజర్ యుగేంధర్, ఆర్‌ఐ బాలకృష్ణ , వీఆర్వోలు సుజాత, శృతి, కుల్లాయిస్వామి పాల్గొన్నారు.

అంతా ప్రచార యోగాంధ్ర

శెట్టూరు: దేశవ్యాప్తంగా జూన్ 21న చేపట్టనున్న యోగాడే సందర్భంగా ప్రభుత్వాలు ప్రచారం కల్పిస్తున్నాయి. ప్రతి చోటా అధికారులు ప్రజలతో యోగా సాధన చేయిస్తున్నారు. అయితే నియోజకవర్గంలోని పలు చోట్ల స్థానిక ఎమ్మెల్యే పోస్టర్‌తో తూతూమంత్రంగా కార్యక్రమం నిర్వహిస్తుండంపై విమర్శలు వస్తున్నాయి. శెట్టూరు మండలంలోని పెరుగుపాళ్యం , తిప్పనపల్లి గ్రామ సచివాలయాల వద్ద గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరుగుపాళ్యం సచివాలయంలో ఒక వ్యక్తి యోగాంధ్ర పోస్టర్ పట్టుకొని ఉండగా, మరి కొందరు అక్కడ యోగా చేస్తున్నట్లు ఫొటొకు ఫోజులిచ్చారు. ఇదే పోస్టర్‌ను తిప్పనపల్లి గ్రామ సచివాలయం వద్ద కూడా ప్రదర్శించి, నవ్వులపాలయ్యారు.



పెరుగుపాళ్యంలో యోగా పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం



తిప్పనపల్లి సచివాలయం వద్ద పోస్టరు పట్టుకున్న అదే వ్యక్తి

హామీలను అమలు చేయాల్సిందే

కూడేరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా సూపర్ సిక్స్ పథకాలు ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. సీఎం చంద్రబాబు మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారేతప్పా హామీలపై శ్రద్ధ చూపలేదని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇంటి నిర్మాణం కోసం 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తామన్న మాటను విస్మరించారన్నారు. జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు.

నీరు, వీదిధీపాల సమస్య పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో వీధి దీపాలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పకు సమస్య వివరించారు. చైర్‌పర్సన్ శిల్ప ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి కాలనీలో సత్వరం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, బోరు మరమ్మతు జరిగే దాకా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరు కావాలని కోరారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం



ఎయిడ్స్‌పై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలో ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలో వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

విత్తన వేరుశనగ కేటాయింపు

ఉరవకొండ రూరల్: మండలంలోని రైతులకు 1,700 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించినట్లు ఏఓ శుభకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కే6 రకం 1,500 క్వింటాళ్లు, కేఎల్ 1812 రకం 100 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 100 క్వింటాళ్ల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలు సుమారు 13,750 హెక్టార్లలో సాగవుతుండగా, వాటిలో 5,150 హెక్టార్లలో వేరుశనగ సాగవుతుందన్నారు. రైతులకు గరిష్ఠంగా 3 బస్తాల విత్తనకాయలు పంపిణీ చేయనున్నారు. జిల్లా కేంద్రం నుంచి స్టాక్ రాగానే పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు.

15వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయింపు

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్‌కు ఈఏడాది 15వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరు చేసినట్లు కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప తెలిపారు. గురువారం ఆయన మండలాల్లో పర్యటించి, విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. రెండు రోజులుగా 4,600 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం ఇప్పటికే ఆయా మండలాలకు సరఫరా అయినట్లు ఏడీఏ తెలిపారు. కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాలకు 2,900 క్వింటాళ్లు, బ్రహ్మసముద్రానికి 2,800 క్వింటాళ్లు, శెట్టూరుకు 2,301 క్వింటాళ్లు, కంబదూరు మండలానికి 2,700 క్వింటాళ్ల విత్తనం మంజూరైనట్లు తెలిపారు.

సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. గురువారం స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

గొర్రెల అపహరణ

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యం గ్రామానికి చెందిన నాగరాజు అనే గొర్రెల కాపరికి చెందిన రెండు గొర్రెలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నాగరాజు కర్ణాటక సరిహద్దులోని సాసులకుంట వద్ద వ్యవసాయ క్షేత్రంలో గొర్రెల పాకలో వంద గొర్రెలను పెంచుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు గొర్రెలను ఎత్తుకెళ్లారు.